క్లుప్తంగా

సబ్బెపల్లి పాఠశాలలో మాక్ పోలింగ్



పోలింగ్ చీటీలతో ఓటు వేసేందుకు విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని సబ్బెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలపై గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. నాయకులుగా బాల, బాలికల నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా విద్యార్థులను ఎన్నికల సిబ్బందిగా, అభ్యర్థులుగా, ఓటర్లుగా విభజించి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఎలా ఉంటుందో చూపించారు. ఓటరు గుర్తింపు కార్డు, ఓటు హక్కు, ఎన్నికల ప్రచారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లుగా చూపించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. బండి రమేశ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నరికివేత



పరిశీలిస్తున్న కార్యదర్శి తిరుమల

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతివనంలోని ఈనెల 10, 11 తేదీల్లో గుర్తుతెలియని వ్యక్తులు 1,495 మొక్కలను నరివేశారని కార్యదర్శి తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీఏ వెంకటేశ్‌తో కలిసి గురువారం ప్రకృతివనం వద్దకు వెళ్లి పరిశీలించారు. మొక్కల నరికివేత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కార్యదర్శి తెలిపారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



వినియోగదారులతో మాట్లాడుతున్న సిబ్బంది

జన్నారం: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు, ఖాతాదారులు వినియోగించుకోవాలని ఏఎంహెచ్ మేనేజర్ సంఘం ఫణిందర్‌రెడ్డి, కిష్టాపూర్ బ్రాంచి మేనేజర్ రమణ చైతన్య సూచించారు. మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై రోడ్ షో కార్యక్రమంలో భాగంగా గురువారం పలువురు ఖాతాదారులు, రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా రైతు రుణాలు, బంగారంపై రుణాలు, వ్యక్తిగత రుణాలు అందిస్తామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాజారమేశ్‌కే చెన్నూర్ టికెట్ ఇవ్వాలి

చెన్నూర్: నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, పార్టీ కోసం పని చేస్తున్న డాక్టర్ రాజా రమేశ్‌కు చెన్నూర్ టికెట్ ఇవ్వాలని మండల నాయకులు గజ్జెల అంకగౌడ్, దొడ్డ మల్లేశ్, కామెర శ్రీనివాస్, రొడ్డ బాపు ఓ ప్రకటనలో తెలిపారు. అధిష్టానం కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టికెట్ ఇవ్వాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థుల నృత్య ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు సీనియర్లు ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల ఆటపాటలు ఎంతోగానూ అలరించాయి. ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, కోశాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్‌లో గురువారం పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతోనే దాడి చేసి నలుగురిని పట్టుకున్నామని ఎస్సై ప్రశాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1100 నగదు, పేకాట సెట్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అలంకారప్రాయమే !



గ్రామంలో ఏర్పాటు చేసిన భగీరథ నీళ్ల ట్యాంకు



నీటి ట్యాంకుకు నీటి సరఫరా కోసం బోర్‌వెల్‌కు బిగించిన మోటారు

- ఊట్లలో నిలిచిన భగీరథ నీటి సరఫరా
- చేతిపంపు పైనే ఆధారం

దండేపల్లి: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో గొప్పలు చెబుతోంది. కానీ అది కొన్నిచోట్ల ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దండేపల్లి మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో గల ఊట్ల గిరిజన గ్రామంలో భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది.

సోలార్ సిస్టం పనిచేయక..

గ్రామంలో 22 కుటుంబాలు, 80కి పైగా జనాభా ఉంది. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేశారు. నీళ్ల ట్యాంకు నిర్మించారు. గ్రామంలో గిరిజనుల కోసం గతంలో ఏర్పాటు చేసిన రెండు చేతి పంపుల్లో ఒక దానికి మోటారు బిగించి, దాని ద్వారా నీటిని ట్యాంక్‌కు ఎక్కించి ఇంటింటికీ నీటిని సరఫరా చేశారు. మోటారు నడిచేందుకు సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. అయితే కొద్దిరోజులకే అది పాడైపోయింది. దీంతో మోటారు నడవక, నీటి సరఫరా నిలిచిపోయింది.

నీటికి ఇబ్బందులు

సోలార్ సిస్టం పాడైపోవడంతో మోటారు నడిచేందుకు పంచాయతీ వారు దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. మోటారు నడిచినప్పటికీ పైప్‌లైన్ పాడైంది. దీంతో నీటి సరఫరా జరగడం లేదు. గిరిజనులు మళ్లీ ఎప్పటిలాగే చేతిపంపులను ఆశ్రయిస్తున్నారు. 80 మందికి రెండు చేతిపంపులు ఉండటంతో నీళ్లకు కొంత ఇబ్బంది అవుతుందని గిరిజనులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పాడైన పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కదిలిన మున్సిపల్ అధికారులు



పశువులను మైదాన ప్రాంతానికి తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూర్: మున్సిపాలిటీలోని ప్రధాన వీధుల్లో పశువుల సంచారంతప్రమాదాలకు నెలవుగా మారింది. ఇటీవల మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోలో పశువులు బీభత్సం సృష్టించిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ తీరుపై ‘పశువులతో పరేషాన్!’శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ గంగాధర్ స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో రోడ్లపై సంచరిస్తున్న మూగజీవాలను మైదాన ప్రాంతాలకు తరలించారు. సాక్షి కథనానికి అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకున్నారు. వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

విగ్రహానికి ముసుగేశారు..



దండేపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాల్సి ఉంటుంది. మేదరిపేట బస్టాప్ వద్ద ఉమ్మడి ఏపీ మాజీ ఉప ముఖ్యమంత్రి జేవీ నర్సింగరావు విగ్రహానికి ముసుగు వేయలేదు. దీనిపై సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి విగ్రహానికి ముసుగు వేశారు.

ప్రభుత్వ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి

- బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్



మురిమడుగులో జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

జన్నారం: ప్రభుత్వ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జన్నారం మండలం మురిమడుగు, వెంకటపూర్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. జాన్సన్ నాయక్ సమక్షంలో పలువురు మహిళలు, యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, కలమడుగు ఎంపీటీసీ స్వరూపరాణి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు ఫజల్ ఖాన్, శ్రీకాంత్, పవన్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల స్థానిక రాళ్లవాగుపై వంతెన నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేయడంపై బైపాస్‌లోని రాళ్లవాగు వద్ద కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతోందని అన్నారు. అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు ఎర్రం తిరుపతి, గడప రాకేశ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తా

మంచిర్యాలక్రైం: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డు ఆదిత్య కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో వచ్చిన నాటినుంచి ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కండువా కప్పుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని పలువురు రిటైర్డు ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఎన్నికల స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రావు తన నివాసంలో వారికి పార్టీ కండువా కప్పారు. రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు తూమల వెంకట్రామయ్య, సీఐఎస్ఎఫ్ రిటైర్డ్ సైనికుడు తూముల సుధాకర్ పార్టీలో చేరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాలి



కోటపల్లిలో పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలు పాటించాలని ఎన్నికల వీడియో సర్వేలెన్స్ టీం అధికారి పొన్న మల్లయ్య సూచించారు. పార్‌పల్లి, పిన్నారం, ఎడగట్ట, ఎసన్‌వాయి, సర్వాయిపేట, కోటపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, అనధికార సమావేశాలు తదితర వాటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఎన్నికల నియమాలను పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య, వీడియో గ్రాఫర్ రాజన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రచారం



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలోని గొల్లపల్లిలో గురువారం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రచారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్తూ తమ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ హామీలు అమలు చేస్తామని వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, సర్పంచ్ పొట్టాల సుమలత, నాయకులు పొట్టాల శ్రీశైలంగౌడ్, సాంబారి కుటుంబరావు, స్థానికులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలక్రైం: పట్టణంలోని ఎడ్లవాడ, గోసేవ మండల్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ పథకాల గురించి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రజలకు వివరించారు. అధికారంలోకి రాగానే పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుని.. ఒక్క అవకాశమివ్వాలని కోరారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కం టాక్స్ రద్దు చేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు



మాట్లాడుతున్న రఘునాథరావు

శ్రీరాంపూర్: బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఇన్‌కం టాక్స్‌ను రద్దు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు తెలిపారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి డబ్బులను అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే నస్పూర్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తామన్నారు. బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు కాశెట్టి నాగేశ్వరరావు, భీమయ్య, వినోద్, పార్టీ నాయకులు మిట్టపల్లి మొగిలి, కొండ వెంకటేశ్, అంబాల సాగర్, కుర్ర చక్రి, సిరికొండ రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



మంచిర్యాలఅర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో..



మంచిర్యాలఅర్బన్: మిమ్స్ పాఠశాలలో..



జన్నారం: వివేకానంద పాఠశాలలో..



రామకృష్ణాపూర్: సెయింట్ జాన్స్‌లో..

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/దండేపల్లి/రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/భీమారం/మందమర్రిరూరల్/జన్నారం/భీమిని/జైపూర్/కాసిపేట: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయినులు రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి ఆడి పాడారు. జిల్లాకేంద్రంలోని శ్రీచైతన్య, ట్రినిటి, మిమ్స్, లక్సెట్టిపేటలోని క్రిష్ణవేణి, ట్రినిటి, జన్నారంలోని వివేకానంద, రాఘవేంద్ర లిటిల్ హౌస్, రామకృష్ణాపూర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్, ఎస్ఆర్‌కే పాఠశాలల్లో సందడి నెలకొంది. బతుకమ్మ పాటలకు స్టెప్పులేస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం నిమజ్జనం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా



నెన్నెలలో పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

నెన్నెల: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్, ఎస్సై శ్యాంపటేల్‌తో కలిసి గురువారం సందర్శించారు. కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ గణేశ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గడప గడపకూ బీజేపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏమాజీ

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కేంద్ర పథకాలను ఇంటింటా వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ తనను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజా సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని సూచించారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు అజ్మీర శ్రీనివాస్, ప్రకాశ్, ప్రభాకర్, సోమన్న, లక్ష్మణ్, సూర్యం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పాతమంచిర్యాల: గర్మిళ్ల లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోదంపుర వెంకటేశ్వర్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

పాతమంచిర్యాల: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని చున్నంబట్టివాడలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు సీహెచ్ నర్సయ్య, వైద్యసిబ్బంది 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం సంయుక్తంగా డిస్ట్రిబ్యూటర్ సెల్స్ రిప్రంజెటివ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ టాలీ స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు మంచిర్యాల మార్కెట్‌రోడ్‌లో పీఎం కౌశల్‌కేంద్రం, అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

తేనెతుట్టె తొలగించాలి..



నెన్నెల: ఎంపీడీవో కార్యాలయం ముఖద్వారం వద్ద ఉన్న స్లాబ్‌కు పెద్ద తేనె తుట్టె ఉంది. నిత్యం అధికారులు, ప్రజలు సేదతీరడానికి ఇక్కడే ఎక్కువగా ఉంటారు. ఒక్కసారిగా గాలివీస్తే తేనెటీగలు లేచి సిబ్బంది ఇక్కడికి వచ్చే ప్రజలపై దాడి చేసే ప్రమాదం ఉంది. గతంలో కుశ్నపల్లి రేంజ్ కార్యాలయంలో వన సందర్శన కార్యక్రమానికి వచ్చిన 28 మంది విద్యార్థులతోపాటు ముగ్గురు ఉపాధ్యాయులు, ముగ్గురు అటవీ అధికారులపై తేనెటీగలు దాడి చేసి గాయపర్చాయి. అలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మణ్



నియామకపత్రం అందిస్తున్న సురేఖ

భీమారం: కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా భీమారం మండలం లాల్‌బహదూర్‌పేటకు చెందిన బోయిరి లక్ష్మణ్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గురువారం ఆయనకు నియామకపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని లక్ష్మణ్ తెలిపారు.